కథ

# అమ్మ చిరునామా

డా.ఎం. కోటేశ్వర రావు
85558 81512

**06.02.2014. రాత్రి గం. 7.15 ని.**

'దయచేసి వినండి. కరీంనగర్ నుంచి తిరుపతి వెళ్లవలసిన ట్రెయిన్ నెంబర్ 12762 తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు, ఒకటవ నెంబర్ ప్లాట్‌ఫాం నుంచి బయలుదేరుటకు సిద్ధముగా ఉన్నది..' ప్రకటన పూర్తి కాక ముందే.. ఒక్క కుదుపుతో ట్రైన్ కదిలింది.

బన్నూ.. కిటికీ పక్క సీట్‌లో కూర్చుంది. పక్కన డా.రావు. మిగిలిన సీట్ అంతా ఖాళీ. డా.రావు చిన్నమ్మాయి శర్వాణి. బన్నూ.. ఆమె ముద్దుపేరు. వాళ్ల ముందు సీట్లో వాళ్లకంటే ముందే ఒక కుటుంబం వచ్చి కూర్చున్నారు. ముప్పై ఏళ్లుండే వివాహిత. ఆమెకు ఒక పక్క మూడేళ్ల పాప. మరోపక్క బెర్త్ మీద పడుకోబెట్టిన చిన్న బిడ్డ. అటుపక్క సింగిల్ సీట్‌లో కాస్త వయసు మళ్లిన మగ మనిషి. అదీ ఆ కుటుంబం. డా.రావు ఆ నలుగుర్నీ ఒకసారి తేరిపార చూశాడు.

ఉన్న పాతచీరల్లో కాస్త పరవాలేదు అనదగ్గ చీర కట్టుకున్నట్టుగా ఉందామె. కట్టు, బొట్టు, మాట, చూపు.. ఒద్దికగా, హుందాగా ఉన్నాయి. బెర్త్‌పైన పడుకున్నది పాపో, బాబో తెలీదు. పాత లుంగీ కప్పి ఉంది. మూడేళ్ల పాప ఒంటిమీద దారపు పోగులు వేలాడుతూ, సాగిపోయిన పాత ఫ్రాక్. నడి వయసు వ్యక్తి పంచె, చొక్కా, భుజం మీద కండువా వేసుకున్నాడు. చొక్కా భుజాల కింద చిరిగింది. పంచెకు అక్కడక్కడా రంధ్రాలు. పాత బ్యాగులు, గోనెమూటలు. అందరినుంచీ ఒకలాంటి మాడిపోయిన నూనె వాసన. ఇవన్నీ ఆ కుటుంబం మధ్య తరగతి కంటే దిగువస్థాయిలో ఉందని చెప్పడానికి పోటీపడుతున్నాయి.

ఇటుపక్క విషయానికొస్తే.. బన్నూ కొత్త ఫ్యాన్సీ డ్రెస్ వేసుకుంది. డా.రావు ఒంటిమీద ఇస్త్రీ మడత నలగని మంచి ప్యాంట్, షర్ట్. టక్ చేసుకున్నాడు. వాళ్లు వాడిన ఫేస్‌వాష్‌లు, బాడీలోషన్స్, క్రీమ్స్, పౌడర్లు, స్ప్రేలు.. వాళ్ల ఉనికిని ఘుమఘుమలతో చాటుతున్నాయి. ఆ తండ్రీ కూతురు వచ్చి కూర్చోగానే.. వాళ్లేదో దారితప్పి వచ్చినట్టు అనుమానంగా చూసింది అవతలి కుటుంబం. చూడటమేకాదు.. నడి వయసు వ్యక్తి అడిగాడు కూడా.

''సారూ గిదెక్కిన్రు! గిది మామూలు డబ్బా.. జూసిన్రా?'' అని.

డా.రావు చిన్నగా నవ్వాడు.

''ఆ.. చూశాను. మా జర్నీ జస్ట్ ఫైవ్ అవర్స్ ముందు ఫిక్స్ అయింది. తత్కాల్ టిక్కెట్స్‌కు కూడా చాన్స్ లేదు. జర్నీ కంపల్సరీ.. సో.. జనరల్ కంపార్ట్‌మెంట్''..

డా.రావు మాట్లాడిన పదాలు పెద్దాయనకు తెలీకపోయినా.. గత్యంతరం లేక, కావాలనే ఆ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కారనే విషయాన్ని మాత్రం అర్థం చేసుకున్నాడు. తన మాటలకు ఎదురుగా కూర్చున్న ఆమె కాస్త ఇబ్బందిగా కదలడం డా.రావు గమనించాడు.

డా.రావుకు ఆ కుటుంబం గురించి తెలుసుకోవాలని అనిపించింది. ఎలా మొదలుపెట్టాలో తెలీక ఆలోచిస్తున్నాడు. మూడేళ్ల పాపను లక్ష్యంగా చేసుకుని..

''హాయ్!'' అని పలకరించాడు.

ఆ పాప ఒకసారి అతనివైపు చూసి, అంతలోనే బిడియంగా తల దించేసుకుంది.

''స్కూల్‌కు వెళ్తున్నావా?''..

సమాధానం లేదు.

''ఏ ఊరికి వెళ్తున్నావ్?''..

మళ్లీ మౌనమే సమాధానం.

ఇంక లాభం లేదని డా.రావు పథకం మార్చాడు.

''మనం ఒక ఆట ఆడుకుందామా? నీకు ఇష్టమైన వాళ్ల పేర్లు నువ్ చెప్పాలంట. ఎన్ని పేర్లు చెప్తే అన్ని చాక్లెట్స్ ఇస్తానంట. రెడీనా మరి?''.

పాప ఒకసారి తలెత్తి చూసి.. మళ్లీ దించేసుకుంది.

'ముందు చాక్లెట్స్ చూపించు' అన్నట్టుగా ఉన్నాయి పాప చూపులు.

''ఏంటీ! నమ్మకం లేదా? అయితే చూడు..'' అంటూ డా.రావు తన ప్యాంట్ పాకెట్‌లోంచి మూడు చాక్లెట్స్ బయటికి తీశాడు. చాక్లెట్స్‌ను చూడగానే పాప మౌనాన్ని వదిలేసింది. బన్నూ ఆసక్తిగా గమనిస్తున్నది.

''సిట్టి.. సుజాత.. పోష.. య!''.

మూడు చాక్లెట్స్ బయటికి తీసినందుకో ఏమో.. పాప సరిగ్గా మూడు పేర్లు చెప్పి ఆగిపోయింది.

''ఎవరు వీళ్లంతా? నీ ఫ్రెండ్సా?''.

పాప ఒకసారి తల అడ్డంగా ఊపి..

''నేను.. అమ్మ.. తాతయ్య!'' అని చెప్పి, కొంత సమాచారం ఇచ్చింది.

మూడు పేర్లు తెలుసుకున్నాడు.

